# సమస్యలు తెలుసుకోవాలనే మీ ముందు కొచ్చా

**తుంగతుర్తి, న్యూస్‌టుడే:** ఈ దుర్మార్గపు ప్రభుత్వంలో ప్రజలు ఎలా బతుకుతున్నారో... ఎలాంటి సమస్యలతో సతమతమవుతున్నారో తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే 'మీ కోసం' ద్వారా మీ ముందు కొచ్చానని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం మీ కోసం కార్యక్రమంలో భాగంగా తుంగుతుర్తి నియోజకవర్గంలో పర్యటించారు. నూతనకల్‌లో మధ్యాహ్నం ప్రారంభమైన ఈ యాత్ర చిల్పకుంట్ల, వెంకెపల్లి, సంగెం, అన్నారం, తుంగతుర్తి తదితర గ్రామాల్లో ప్రసంగించారు. ఈ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం పెరిగే ధరలతో సామాన్యుడు బ్రతికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఈ చిరు గాలికే కరెంటు పోతే ఎట్లా...!..** బుధవారం రాత్రి తుంగతుర్తిలో మీ కోసం కార్యక్రమం ప్రారంభమౌతుండగానే చిరు గాలి (జల్లు) మొదలైంది. వెంటనే స్పందించిన చంద్రబాబు ఈ చిన్న గాలికే కరెంటు పోతే మరి గాలిదుమారాలు వచ్చినప్పుడు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తన పాలనలో అధికారులను ఒక గాడికి తీసుకొచ్చాను. కాని నేడు ప్రభుత్వ శాఖలు గాడి తప్పడంతో ప్రజలు సమస్యలతో సతమత మవుతున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో తెదేపా అధికార ప్రతినిధి దామం విక్రంరెడ్డి, గంథాలయ ఛైర్మన్ సంకినేని రవిందర్‌రావు, ఎంపీపీ తాటికొండ సీతయ్య, మండల పార్డీ అధ్యక్షుడు మైదం నారాయణ, కార్యదర్శి తునికి సాయిలు, మండల యూత్ అధ్యక్షుడు గాజుల మహేందర్, సర్పంచులు వినోద, చంద్రకళ, ఎంపీటీసీలు సైదులు రేణుక, శ్రీనివాస్, రమేష్, లాలు, తదితరులు పాల్గొన్నారు.

**ఆయన మాకు ఏమీ ఇవ్వలేదు..** కాంగ్రెస్ ప్రభుత్వంలో మాకు అన్యాయం జరుగుతుందని ఏ ఒక్క పథకాన్ని కూడా మాకు ఇవ్వడం లేదని సంగెం శివారు తండా గిరిజనులు చంద్రబాబుకు మొరపెట్టుకున్నారు. మా దగ్గర కాంగ్రెస్‌వాళ్లకే పింఛన్లు, ఇండ్లు ఇస్తున్నారు కాని మాకు మాత్రం ఇవ్వడంలేదని గోడు వెళ్లబుచ్చుకున్నారు.

**మమ్ములను ఆదుకోండి..** రోజు రోజుకు ధరలు పెరుగుతున్నాయి... వర్షం పడ్తలేదు... పంటలు ఎండి పోతున్నాయి... కరెంటు లేక పోలం నాటు పెడ్డలేదు. ఇలాంటి పరిస్థితిలో మేము ఎట్లా బతకాలి అంటూ అన్నారంకు చెందిన ఓ యువతి బాబుకు మొరపెట్టుకుని మీరే పరిష్కారం చూపి మమ్ములను ఆదుకోవాలంటూ వేడుకుంది.